# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-11-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ప్రపంచ దేశాలకు భారత రాజ్యాంగం గొప్ప ఉదాహరణగా నిలిచిందని పేర్కొన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.**

2. **ప్రతి ఒక్కరూ రాజ్యాంగంపట్ల అవగాహన కలిగి ఉండాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

3. **డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలులో డ్రైనేజీ వల్ల దెబ్బతిన్న కొబ్బరి తోటలను పరిశీలించిన ఉపముఖ్యమంత్రి కె. పవన్‌కల్యాణ్.**

4. **వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచన.**

5. **రాష్ట్రంలో 12 వందల కోట్ల రూపాయల వ్యయంతో 4 వేల 554 గ్రామీణ వైద్యశాలలను నిర్మిస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్య కుమార్ యాదవ్ వెల్లడి.**

==========================

భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఢిల్లీలోని సంవిధాన్ సదన్‌లో ఈరోజు నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు పలువురు పార్లమెంటు సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్యాంగ ప్రవేశికను పఠించారు. అనంతరం రాష్ట్రపతి మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలకు భారత రాజ్యాంగం గొప్ప ఉదాహరణగా నిలిచిందన్నారు.

..వాయిస్.. 17 సెకన్లు

భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలను ఉద్దేశిస్తూ.. బహిరంగ లేఖను రాశారు. దేశ పౌరులు రాజ్యాంగ విధులను నిర్వహించాలని, బలమైన ప్రజాస్వామ్యానికి రాజ్యాంగ విధులే పునాదులని తెలిపారు. భారత రాజ్యాంగం అత్యంత శక్తివంతమైనదని, పౌరులకు కలలు కనే శక్తితో పాటు వాటిని సాకారం చేసుకునే అవకాశాలను రాజ్యాంగం కల్పించిందని పేర్కొన్నారు.

--------------------------

భారత రాజ్యాంగ దినోత్సవం- 2025ను పురస్కరించుకుని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులతో "మాక్ డ్రిల్ శాసనసభ" సమావేశాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు నిర్వహించింది.

ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాక్ శాసనసభలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, శాసనసభాపతి, శాసనసభ్యులుగా వ్యవహరించారు. ఈ సమావేశంలో సామాజిక మాధ్యమాల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ బిల్లులపై స్వల్పకాలిక చర్చ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి పాల్గొని మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ రాజ్యాంగంపట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు.

వాయిస్...29 సెకన్లు

---------------------------

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలులో ఉపముఖ్యమంత్రి కె. పవన్‌కల్యాణ్ ఈరోజు పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా కేశనపల్లి తీర గ్రామాల్లో డ్రైనేజీ నుంచి వస్తున్న సముద్ర జలాల కారణంగా దెబ్బతిన్న కొబ్బరి చెట్లను పరిశీలించారు. అనంతరం సంబంధిత రైతులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోడ్డు మార్గం ద్వారా శివకోడుకు చేరుకున్న పవన్ కళ్యాణ్ 'పల్లె పండుగ 2.0 పైలాన్'ను ఆవిష్కరించారు. అనంతరం అక్కడ జరిగిన బహిరంగ సభలో ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ,

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు, నేర నియంత్రణ, పోలీస్ విభాగానికి అవసరమైన వనరులపై అమరావతిలోని సచివాలయంలో పోలీసు ఉన్నతాధికారులతో మంత్రి నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, నేర నియంత్రణకు అవసరమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వసతుల విషయంలో ప్రభుత్వం రాజీపడబోదని తెలిపారు.

---------------------------

గోవాలో జరుగుతున్న 56 వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం– ఇఫీలో "ది న్యూ ఎఐ సినిమా" అనే అంశంపై మాస్టర్ క్లాస్‌ను నిన్న నిర్వహించారు. చిత్రనిర్మాత శేఖర్ కపూర్ నేతృత్వంలోని సాంకేతిక నిపుణులు శంకర్ రామకృష్ణన్, వి. మురళీధరన్, ఆధునిక సినిమాలో కృతిమ మేధ ద్వారా కలిగే సృజనాత్మక అవకాశాలు, కృత్రిమ మేధస్సు చలనచిత్ర నిర్మాణాన్ని ఎలా పునర్ నిర్మిస్తుందనే అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎఐ ఆధారంగా నిర్మించిన ది లాస్ట్ లెజెండ్స్ డాక్యుమెంటరీని ప్రదర్శించారు.

---------------------------

వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. బంగళాఖాతంలో నెలకొన్న వాతావరణ పరిస్థితులు కారణంగా ముందస్తు జాగ్రత చర్యలతో సన్నద్ధం కావాలని ఈ మేరకు ఒక ప్రకటనలో తెలిపారు. క్షేత్ర స్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు పర్యటించి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని అన్నారు. రైతులు ధాన్యాన్ని జాగ్రత్త చేసుకోవాలని, రైతాంగానికి ఉచితంగా టార్పలిన్ పట్టాలను ప్రభుత్వం తరపున సరఫరా చేస్తున్నామన్నారు.

---------------------------

కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన నూతన కార్మిక చట్టాలను ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు స్వాగతించారు. గతంలో ఉన్న 29 చట్టాలను మార్పు చేసి నాలుగు కోడ్స్ గా అమలు చేయడం ద్వారా కార్మికులకు మరింత మేలు కలుగుతుందని ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షులు రాజశేఖర్ మాట్లాడుతూ,

వాయిస్ 23 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో 12 వందల కోట్ల రూపాయల వ్యయంతో 4 వేల 554 గ్రామీణ వైద్యశాలలను నిర్మిస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మనుబోలులో కోటి 65 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని స్థానిక శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితో కలిసి ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు విస్తృతంగా వైద్య సేవలు అందించే లక్ష్యంతో ఈ విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

---------------------------

జాతీయ పాల దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు. దేశంలో శ్వేత విప్లవానికి పితామహునిగా పేరు గాంచిన డాక్టర్ వర్గీస్ కురియన్ జయంతిని జాతీయ పాల దినోత్సవంగా పాటిస్తున్నారు. పాల ఉత్పత్తిలో భారతదేశాన్ని ప్రపంచంలోనే మొదటి స్థానంలో నిలిపిన వర్గీస్ కురియన్... 1921 నవంబర్ 26వ తేదీన కేరళ రాష్ట్రంలోని క్యాలికట్లో జన్మించారు. ఆయన రూపొందించిన “బిలియన్ లీటర్ ఐడియా, ఆపరేషన్ ఫ్లడ్, కార్యాచరణ ప్రపంచంలోనే అతిపెద్ద వ్యవసాయ, పాడి పరిశ్రమ కార్యక్రమంగా నిలిచింది. పాడి పరిశ్రమలో ఆయన చేసిన కృషితో భారతదేశం అధిక పాల ఉత్పత్తి దేశంగా నిలిచింది.

---------------------------

నైరుతి బంగాళాఖాతం మీదుగా అల్పపీడనం కొనసాగుతోందని భారత వాతావరణ విభాగం తెలిపింది. ఇది ఉత్తర వాయవ్య దిశగా కదులుతూ రానున్న 12 గంటల్లో తీవ్ర అల్పపీడనంగా మారుతుందని తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఈ నెల 29వ తేదీ వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం అధికారి ఎల్.నారాయణ పేర్కొంటూ..

వాయిస్...21 సెకన్లు

=====================